కారు గుర్తుకు ఓటేసి ఆశీర్వదించాలి

మంత్రి సబితాఇంద్రారెడ్డి

ఆర్కేపురం, నవంబర్ 26 : ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ అనేక పథకాలు ప్రవేశపెట్టారని మహేశ్వరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో నిర్వహించిన రోడ్ షోలో సబితాఇంద్రారెడ్డి పాల్గొన్నారు. దారి పొడవునా మహిళలు బోనాలు, హారతులు ఇస్తూ పూలతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేశ్, న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, గొడుగు శ్రీనివాస్, కొండ్ర శ్రీనివాస్, ముప్పిడి లింగస్వామిగౌడ్, సిద్దగోని వెంకటేశ్ గౌడ్, పెంబర్తి శ్రీనివాస్, సాజీద్, నియోజకవర్గ వర్కింగ్ అధ్యక్షురాలు పటేల్ సునీతారెడ్డి, డివిజన్ మహిళా అధ్యక్షురాలు లిక్క ఊర్మిలారెడ్డి, చామల శైలజారెడ్డి, మారం సుజాతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బడంగ్‌పేటలోని గుర్రంగూడ, నాదర్‌గుల్ రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

వారెంటీలేని గ్యారెంటీలు ఎందుకు

బడంగ్‌పేట, నవంబర్ 26 : అబద్దాలు చెప్పే బీజేపీకి తెలంగాణలో స్థానం లేదని మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో మంత్రి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ వారెంటీ లేని గ్యారంటీలను ప్రకటించి ప్రజలను మోసం చేస్తున్నదన్నారు.

పద్మశాలీలను అన్ని విధాలా ఆదుకుంటాం..

పద్మశాలి సంఘం ఆత్మీయ సమ్మేళనంలో సంఘం నేతలతో కలిసి అభివాదం చేస్తున్న ముఠా గోపాల్

- బీఆర్ఎస్ ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్..
- ముషీరాబాద్‌లో పద్మశాలి సంఘం ఆత్మీయ సమ్మేళనం

కవాడిగూడ, నవంబర్ 26: పద్మశాలీలను అన్ని విధాలా ఆదుకుంటామని బీఆర్ఎస్ ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్‌లోని హెరిటేజ్ ఫంక్షన్ హాల్‌లో ముషీరాబాద్ నియోజక వర్గం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళన సభను నిర్వహించారు. ఈ సభకు సంఘం సీనియర్ నాయకుడు సంఘిశెట్టి జగదీశ్వర్ రావు అధ్యక్షతన వహించగా.. ముఖ్య అతిథిగా ముఠా గోపాల్ హాజరై మాట్లాడారు. గత ఎన్నికల్లో పద్మశాలీలు బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు ఇచ్చారని, ఈ ఎన్నికల్లో కూడా నియోజకవర్గంలోని అన్ని సంఘాలు తనకు మద్దతునిచ్చి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ముషీరాబాద్ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్ రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ముఠా జైసింహ మాట్లాడుతూ.. పద్మశాలీల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించిందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా చేనేత వృత్తిని కాపాడేందుకు సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. ఈ సమావేశంలో పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ వి. శ్రీనివాస్ రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి ఎక్కాల కన్న యాదవ్, సినీహీరో రోశం బాలు, పార్టీ సీనియర్ నాయకుడు బింగి నవీన్ కుమార్, నాయకులు బల్ల ప్రశాంత్, తలకొక్కుల సంజీవ్ కుమార్, అతినగరం సుదేశ్, రాపోలు రమేశ్, పున్న సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ముఠా జైసింహ అన్నారు. ఆదివారం భోలక్‌పూర్‌లోని ఎస్‌బీఐ కాలనీలో బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాగా, బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని భోలక్‌పూర్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు కేఎం శంకర్ అన్నారు.ఆదివారం భోలక్‌పూర్‌లో గంగపుత్ర సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భోలక్‌పూర్ గంగపుత్ర సంఘం బీఆర్ఎస్ ముషీరాబాద్ అభ్యర్థి ముఠా గోపాల్‌కే తమ సంపూర్ణ మద్దతు అంటూ రాష్ట్ర సంఘంతో పాటు స్థానికంగా ఉన్న 29 సంఘాల సభ్యులు ఏకగ్రీవంగా తీర్మాణం చేశారు.

అక్రమ మద్యం రవాణాపై నిఘా

సిటీబ్యూరో, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): మరో మూడు రోజుల్లో ఎన్నికలు ఉండటంతో ఓటర్లను ఆయా రాజకీయ పార్టీలు మద్యంతో మభ్యపెట్టే అవకాశాలున్నందున అక్రమ మద్యం విక్రయాలు, రవాణాపై ఆబ్కారీ అధికారులతో కలిసి పోలీసులు నిఘా పెంచారు. ఇప్పటికే సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులకు అదనంగా ఆబ్కారీ శాఖ ప్రత్యేకంగా మిర్రర్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా ఇతర ప్రాంతాల నుంచి సైబరాబాద్ పరిధిలోకి అక్రమ మద్యం రవాణా జరగకుండా నిఘా పెంచామని అధికారులు తెలిపారు. సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర సూచనల మేరకు కమిషనరేట్ పరిధిలోని ఐదు జోన్ల డీసీపీలు, ఏసీపీలు, ఎస్‌హెచ్‌ఓలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులతో కలిసి మద్యం విక్రయాలు, రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ఈనెల 28 సాయంత్రం 5గంటల నుంచి 30 సాయంత్రం 5 గంటల వరకు కమిషనరేట్ పరిధిలో మద్యం విక్రయాలను నిలిపివేస్తున్న దృష్ట్యా డ్రై డేస్‌లో మద్యం విక్రయాలు జరగకుండా, బెల్టు షాపులు నిర్వహించకుండా పకడ్బందీ చర్యలు చేపట్టామని, డ్రై డేస్‌ను పర్యవేక్షించేందుకు కమిషనరేట్ పరిధిలో ఆబ్కారీ శాఖ 6 ఫ్లైయింగ్ స్క్వాడ్స్‌ను రంగంలోకి దింపినట్లు అధికారులు తెలిపారు. ఈనెల 28 సాయంత్రం 5 గంటల్లోపు జరిగే మద్యం విక్రయాలు, నిల్వలపై ప్రత్యేక నిఘా పెట్టామని, బల్క్ విక్రయాలకు పాల్పడితే మద్యం వ్యాపారులతో పాటు కొనుగోలుదారులపై కూడా చర్యలు తప్పవని ఆబ్కారీ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఓటర్లకు మద్యం పంపిణీ చేస్తే ఎన్నికల నియమావళి ఉల్లంఘన చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

అక్రమ డబ్బు రవాణాపై ఎస్ఓటీ తనిఖీలు

సమాచారానికి ప్రత్యేక ఇంటెలిజెన్స్ వ్యవస్థ

సిటీబ్యూరో, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): మరో రెండు రోజుల్లో ప్రచార పర్వం ముగియనుంది. ఈనెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి ప్రచార రథాలు ఎక్కడికక్కడే ఆగిపోనున్నాయి. మాటల తూటాలు మూగబోతాయి. ఇక ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు ఎత్తుకు పై ఎత్తులు వేయడం సహజం. ఈ క్రమంలోనే ఓటర్లను మభ్యపెట్టేందుకు పెద్ద ఎత్తున డబ్బులు పంపిణీ చేసే అవకాశం ఉండటంతో పోలీసులు, ఎన్నికల కమిషన్ అప్రమత్తమైంది. డబ్బు పంపిణీని అడ్డుకునేందుకు ఇప్పటికే పలు చోట్ల తనిఖీలు, దాడులు నిర్వహించి కోట్ల రూపాయల అక్రమ డబ్బును పట్టుకుని పోలీసులు సీజ్ చేశారు. పోలీసులు, ఎన్నికల అధికారులు ముందున్న ఈ రెండు రోజులపై ప్రత్యేక దృష్టి సారించారు. డబ్బులు పంపిణీ చేసే వారిని గుర్తించడంతో పాటు అక్రమంగా డబ్బులు నిల్వ చేసిన స్థావరాలను కూడా తెలుసుకునేందుకు ప్రత్యేక ఇంటెలిజెన్స్ వ్యవస్థను రూపొందించినట్లు సమాచారం. ఇందులో భాగంగానే.. రాజకీయ పార్టీల కదలికలను ఎప్పటికప్పుడు పసిగట్టేందుకు షాడో బృందాలను రంగంలోకి దింపారు. వాహనాల తనిఖీలను కూడా మరింత ముమ్మరం చేసినట్టు పోలీసు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉన్న చెక్ పోస్టులకు అదనంగా మరో 38 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

ఎయిర్‌పోర్టు మెట్రో న్యూస్ లెటర్‌కు పీఆర్ఎస్ఐ అవార్డు

అవార్డు అందుకుంటున్న మెట్రో పౌర సంబంధాల అధికారి కృష్ణానంద్

సిటీబ్యూరో, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లిమిటెడ్ వార్తా లేఖ ప్రతిష్టాత్మక పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్ఎస్ఐ) -2023 జాతీయ అవార్డును గెలుచుకుంది. జూన్ త్రైమాసికానికి సంబంధించిన వార్తా లేఖలో ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ ప్రాజెక్టు ప్రత్యేకతలు, నిర్మాణానికి పూర్వం చేపట్టిన పలు పనుల వివరాలు, ఎండీ ఎన్వీఎస్ రెడ్డి నిర్వహించిన క్షేత్ర స్థాయి పర్యటనలు, ఇతర కార్యక్రమాల ఫొటోలతో ప్రచురితమైన న్యూస్ లెటర్‌కు పీఆర్ఎస్ఐ జాతీయ స్థాయిలో మొదటి బహుమతిని అందజేసింది. నవంబర్ 25న ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్ మెట్రో రైలు పౌరసంబంధాల అధికారి ఎం.కృష్ణానంద్‌కు ఈ జాతీయ అవార్డును రాజ్యసభ సభ్యుడు సుధాంశు త్రివేది, పార్లమెంటు సభ్యుడు నరేశ్ బన్సాల్ సమక్షంలో రిషికేశ్‌కు చెందిన స్వామి చిదానంద సరస్వతి స్వామి అందజేశారు. ఈ సందర్భంగా మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో అవార్డు రావడం సంతోషంగా ఉన్నదన్నారు.

బొమ్మను గీసి.. చైతన్యపరిచి

ఆలోచింప జేసిన కార్టూనిస్టుల చిత్రాలు

చిత్రాలు గీసిన కార్టూనిస్టులు

ఖైరతాబాద్, నవంబర్ 26 : ఎన్నికల పండుగ వచ్చేసింది.. ఓటుకు ఇంత.. అంతా అంటూ కొందరు నేతలు, పార్టీలు ప్రలోభపెడుతుంటాయి. ఈ నేపథ్యంలో ఓటర్లను చైతన్యపర్చేందుకు తెలంగాణ ఆర్టిస్ట్ ఫోరం ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నిత్యం పత్రికల్లో చైతన్యపర్చే కార్టూన్లతో ఆకట్టుకున్న ప్రముఖ కార్టూనిస్టులు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ వేదికగా తమ కలాలతో ఓటర్లను చైతన్యపర్చే కార్యక్రమాన్ని చేపట్టారు. ఫోరం ప్రతినిధి ఎంవీ రమణా రెడ్డి నేతృత్వంలో భారీ కాన్వాస్‌పై కార్టూనిస్టులు అక్బర్, అవినాశ్, చిత్ర, మృత్యుంజయ, నారు, నర్సిమ్, నివాస్ చొల్లేటి, పీఎస్ చారి, రాకేశ్, శంకర్, సుభానీ, సురేందర్, వెంకటేశ్, వెంకట్ తమ కలానికి పని చెప్పారు. ఓటును అమ్మడం.. మీ భవిష్యత్తును అమ్ముడమేననే నినాదంతో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో కార్టూనిస్టులు గీసిన చిత్రాలు ఆలోచింపజేశాయి. అసెంబ్లీ ఎన్నికలతో పాటు రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు రమణా రెడ్డి తెలిపారు.

నేడు ప్రధాని రోడ్డు షో.. ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): నేడు ఆర్టీసీ ఎక్స్ రోడ్స్ నుంచి కాచిగూడ ఎక్స్ రోడ్స్ వరకు ప్రధాని నరేంద్ర మోదీ రోడ్డు షో ఉన్నదని, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 10 గంటల వరకు ఆ రూట్‌లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని నగర ట్రాఫిక్ అదనపు సీపీ సుధీర్‌బాబు తెలిపారు. బేగంపేట ఎయిర్ పోర్టు నుంచి బేగంపేట, పంజాగుట్ట, రాజ్‌భవన్, ఖైరతాబాద్ ఫ్లైఓవర్, నెక్లెస్ రోటరీ, తెలుగు తల్లి జంక్షన్, ఇందిరా పార్కు, అశోక్‌నగర్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌కు ప్రధాని చేరుకుంటారన్నారు. అక్కడి నుంచి చిక్కడపల్లి, నారాయణగూడ, కాచిగూడ క్రాస్ రోడ్స్ వరకు రోడ్ షో ఉంటుందన్నారు. ప్రధాని పర్యటన, రోడ్ షో సందర్భంగా ఆయా రూట్లలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయన్నారు.

లారీ ఢీకొని.. ర్యాపిడో డ్రైవర్ మృతి

వెంగళరావునగర్, నవంబర్ 26: లారీ ఢీకొని ర్యాపిడో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన ఎస్ఆర్ నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై రవిరాజ్ కథనం ప్రకారం.. తుర్కయాంజల్ సమీపంలోని మన్నెగూడకు చెందిన తాగారామ్ జాన్ (23) బాపూనగర్‌లో అద్దెకుంటూ.. అమీర్‌పేటలో సాఫ్ట్‌వేర్ కోర్సులో శిక్షణ పొందుతున్నాడు. ఉదయం పూట ఖాళీ సమయాల్లో ర్యాపిడో బైక్ నడుపుతూ జీవనోపాధి పొందుతున్నాడు. అతడి బాల్య మిత్రుడు షేక్ అన్సారీ శనివారం జాన్ వద్దకు వచ్చాడు. జాన్‌కు ర్యాపిడో నుంచి కాల్ రావడంతో ఆదివారం తెల్లవారు జామున పిక్‌అప్ చేసుకునేందుకు బయలుదేరాడు. వెనుకాలే అతడి మిత్రుడు కూడా మరో ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మైత్రీవనం నుంచి యూసుఫ్‌గూడ స్టేట్‌హోం వైపు మలుపు తీసుకుంటుండగా.. పంజాగుట్ట వైపు నుంచి వచ్చిన లారీ జాన్ నడుపుతున్న బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో అతడు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. లారీని డ్రైవర్ పరారయ్యాడు. షేక్ అన్సారీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.